నిత్యశాంతినిలయమైన ఈ నిలయమునకు ఈ దినము ఒక నూతనానుభూతి కలిగినది. దాని విశిష్టతను పురస్కరించుకొని ప్రభుత్వము దానికొక విశిష్టస్థానమును కల్పించిన కారణమువల్ల భక్తులందరిలోనూ ఆనందానుభూతి కనబడుచున్నది. మానవుడు రసస్వరూపుడు. మానవత్వమే ఆనందస్వరూపము, శాంతిస్వరూపము, ప్రేమస్వరూపము. దాని విలువ తెలియక, దానిని పోషించి ఆరగించే విధానము తెలియక బహువిధములైన బాధలలో మానవులు పడిపోదురు. మూడువందల రూపాయలు యిచ్చి తీసికొన్ననూ, గడియారముయొక్క వినియోగ విధానము తగిన క్రమశిక్షణము తెలియనిచో అది పాడైపోతుంది. నాలుగు వందల రూపాయలిచ్చి తీసికొన్న ట్రాన్‌సిస్టర్‌కూడ విలువ తెలియని, విధానము తెలియని వాని దగ్గరుంటే వ్యర్థమే. సమస్త ప్రాణికోటిలో మానవ జన్మము అత్యుత్కృష్టమైనదని గర్వపడితే ఏమి ప్రయోజనము! ఈ నాటక రంగములో ప్రథమ స్థానమున ప్రవేశించినందుకు తగినట్లు ధర్మకర్మలను ఆచరించవలయును.

ఆధ్యాత్మిక మార్గమునకు భారతభూమి పుట్టినిల్లు, పెట్టినపేరు. మానవజాతికి భారతదేశమే ఉపాధ్యాయస్థానములో వేలాది సంవత్సరముల పర్యంతము విరాజిల్లినది. అయితే, భారతీయులు ఆధునిక నాగరికతయొక్క ప్రభావమువల్ల పాశ్చాత్యుల బానిసలై ఆస్తికతను కోల్పోయిరి. ఈ ప్రశాంతినిలయము మానవత్వములో దాగియున్న దివ్యత్వమును ప్రజ్వలింపజేసే సంస్థ. అఖిల మానవులకు ఆనందమొనగూర్చుటకిదే మార్గము. ప్రతియొక్క మానవుడూ తన దివ్యత్వాన్ని గుర్తించి దానినే ధ్యానించి వ్యక్తపరచు శక్తిని పొంది ముక్తిని సంపాదించవలయును. మానవుని సహజస్వభావములు దయ, ధర్మము, సత్యము, ఆనందము – ఇవియే. వీటిని మరుగుజేసి తద్విరుద్ధ గుణముల నాశ్రయించిన, మానవత్వమునకు మసిపూసినట్లే.

పవిత్రతను సార్థకము చేసుకొనవలెనన్న సంస్కారము అవసరము. బంగారములో చేరిన రాగి, వెండి మొదలైన లోహములను అగ్నిలో కాల్చి కరగించి విడదీసి పారవేసి స్వచ్ఛబంగారమును ప్రత్యేకించినట్లు, దుర్గుణములనూ, దుస్సంగమునూ పశ్చాత్తాపము జపధ్యానములు మొదలైన సంస్కారముల మూలకముగా నిర్మూలము చేయవలయును. భగవంతుని అనుగ్రహ కిరణములను అంధకారపూరిత హృదయమునకాహ్వానించి, ఆదరించి నిలబెట్టుకొనవలయును. గాలిలేని గదిలో వుంటే ప్రాణము పోతుంది. అట్లనే, ఆత్మవిశ్వాసము లేకపోతే శ్వాసముండిననూ జీవితము వ్యర్థమే. మీ నిజనామము, నిజరూపు ఇవికావు. మీరందరూ ఆత్మయే, నిర్మలమే, నిశ్చలమే. ఎల్లయ్య, పుల్లయ్య అని, లావు, పొట్టి అని భ్రాంతిపడుతున్నారేగాని, అవి వారి నిజతత్త్వములు కావు. పశువులు కాసేవాడు ఇంటికి వెళ్లి వారి పశువులన్నింటినీ తోలుకొనిపోవుచూ, 'నా ఆవు పోయినదిరా, నా ఆవు ఈనిందిరా' అంటాడు. కాని, వాటికి యజమాని యింకొకడని అతనికి బాగా తెలుసు. కాని, వానికి ఆ మాట అలవాటైపోయినది. అదీ ఒక మూఢత్వమే. సాయంకాలము కన్నుకనిపించని చిమ్మచీకటిలో ఒక భిక్షగాడు ఒక గృహస్థుని ఇంటి ముందర వచ్చి ఆశ్రయమడిగినాడు. 'ఇదేమి సత్రమనుకొంటివా? వెళ్ళిపో' అని తరిమితే, ఆ భిక్షగాడు శాంతముగా, 'దీనిని ఎవరు కట్టినారు స్వామీ!' అని అడిగినాడు. 'ఇది నా ముత్తాత కట్టిన యిల్లు. నా తాత, నా నాయన అందరూ నివసించిన యిల్లు. ఇపుడు ఇది నా ఇల్లు' అన్నాడు ఆయన, జంభంగా. అపుడా భిక్షగాడు, 'అందరూ కొంతకాలము నాది నాది నాది అని అభిమానముతో చెప్పుకొని నివసించి వెళ్ళిన ఈ కట్టడము సత్రముకాక మరేమిటి?' అని ప్రశ్నించినాడు. వివేకము, విచక్షణము, వైరాగ్యము, మానవులకు భగవంతుడనుగ్రహించిన ప్రత్యేక ప్రసాదము. ఈ సత్యమును శాస్త్రములచే తెలిసికొన సాధ్యము. మహర్షులు తమ హృదయములను మథించి అందించిన సుధానిధిని చవిచూచి చప్పరించిన, తరువాత విషయములనే చేదును యెవడూ ఆరగించడు.

ముఖ్యముగా, భక్తులు యేపని చేసినా భగవదర్పితముగా, భగవదాదేశానుసారముగా చేయవలయును. శబరికి దినమంతా రామచింతనే. శ్రీరామడు ఏ మార్గమున వచ్చునోయని ఆమె అరణ్యమంతా తిరిగి, ముళ్ళు తీసివేసి తగ్గులో వున్న చెట్టుకొమ్మలను కోసివేసినది. వంగిపోయిన ముద్దఅయిననూ ఆమె అన్ని కర్మలనూ పరమాత్మ సేవగానే నిర్వర్తించినది. భక్తులంటే, నిరంతరమూ భక్తులుగా మెలగవలయును. జప, ధ్యాన, భజన సమయములలో భక్తులు, మిగిలిన కాలమంతా భుక్తులుగా గడపకూడదు. కష్టములు రానీ, సుఖములు రానీ, తీపు దొరకనీ, చేదు దొరకనీ అన్నియునూ భగవత్ప్రసాదమే అను భావమును పెంచవలయును.

'టౌన్‌షిప్' ప్రారంభోత్సవము అనిన ఒక పంచాయతీనుండి వేరయి, ప్రత్యేకము కావలయుననే భావము కాదు. బృందావనము అందరిదీ, గోవిందుడు అందరివాడే అన్నట్లు అన్ని గ్రామములు మనవే! ప్రపంచములో నావారు కానివారు ఎవ్వరూ లేరు. దీని ద్వారా ఈ ప్రాంతమును మంచిగా పోషించవలయుననే ఉద్దేశ్యమే నాకు. ఇచ్చట సంత్సగము అభివృద్ధి చేసితే, మానవత్వములోని దివ్యత్వము అభివృద్ధి అవుతుంది. దీనిని చక్కగా నిర్వహించిన భక్తులకు మంచి ట్రైనింగ్ దొరకును. రాష్ట్రమునకే ఆదర్శప్రాయముగా వుండును. ప్రభుత్వముయొక్క నిబంధనలను పాలించి ఇచ్చట స్థిరనివాసము అనుకూలములను కల్పించే కొరకు సమితి సభ్యులు పాటుపడవలయును. పంచాయతీ సభ్యులు మొదలుకొని పంచాయతీరాజ్ శాఖామాత్యుల వరకూ అందరూ దీనికొరకు శ్రద్ధాభక్తులతో ప్రయత్నించి సాఫల్యము పొందిరి. పరిశుభ్రత, పరిపాలన సేవలంతా ప్రజానందాన్ని అభివృద్ధి పరచేకొరకు అని భావించి సమితి సభ్యులు సంతోషముగా, ఉత్సాహముగా పనిచేయవలయును. ఆ ప్రజానంద ప్రవాహము భగవదనుగ్రహ సాగరములో జేరి తన రూపనామరుచులను మార్చుకొని సార్థకత పొందును.